# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 27- ఏప్రిల్ 2026 | సంపుటి : 3 | సంచిక : 329 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# జనగణన-2027కు శ్రీకారం

## స్వీయ గణనలో సీఎం రేవంత్ రెడ్డి
## ఆన్‌లైన్ స్వీయ నమోదు ప్రారంభం
## ప్రజల భాగస్వామ్యంతో ఖచ్చితమైన జనాభా లెక్కలు లక్ష్యం
## డిజిటల్ తెలంగాణ దిశగా మరో కీలక అడుగు



**హైదరాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణన-2027లో భాగంగా తెలంగాణలో స్వీయ గణన ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో పాల్గొని తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నాంది పలికారు. దీంతో రాష్ట్రంలో ఈ ప్రక్రియకు విస్తృత స్థాయిలో ప్రచారం లభించింది.

అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా ముఖ్యమంత్రి స్వీయ నమోదు పూర్తి చేసి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా సరైన జనాభా లెక్కలు సాధ్యమవుతాయని తెలిపారు. జనగణన విజయవంతం కావడానికి ప్రజల సక్రియ భాగస్వామ్యం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

జనగణనలో భాగంగా తొలిసారిగా ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానం ప్రజలకు సులభతరం చేయబడిందని అధికారులు వివరించారు. మొబైల్ నంబర్, ఓటీపీ ధృవీకరణ ఆధారంగా ప్రజలు సురక్షితంగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, నివాస సమాచారం, సౌకర్యాలు వంటి అంశాలను సమగ్రంగా నమోదు చేసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా సెన్సస్ అధికారులు స్వీయ గణన ప్రక్రియపై ముఖ్యమంత్రికి సమగ్ర వివరణ అందించారు. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా నివాస స్థలాన్ని ఖచ్చితంగా గుర్తించడం ముఖ్యమని సూచించారు. నమోదు అనంతరం ప్రత్యేక ఎస్‌ఈ ఐడీ జారీ అవుతుందని, తద్వారా డేటా ధృవీకరణ సులభమవుతుందని వివరించారు.

మిగతా 2లో

## ప్రజావాణి సేవల విస్తరణకు సీఎం ఆదేశాలు

- అర్జీల పరిష్కార వ్యవస్థకు పకడ్బందీ అమలు
- రెవెన్యూ డివిజన్ నుంచి మండల స్థాయి వరకు విస్తరణ
- డిజిటల్ ట్రాకింగ్‌తో వేగవంత పరిష్కారం లక్ష్యం

2లో



## పర్యావరణవేత్తపై దాడిని ఖండించిన మంత్రి కొండా సురేఖ

- నిమ్స్‌లో పరామర్శించిన మంత్రి
- దుశ్చర్ల సత్యనారాయణకు మద్దతు
- దాడి ఘటనపై కఠిన చర్యల ఆదేశాలు

2లో





## మంత్రి పొన్నంకు ఆర్టీసీ జేఏసి నేతల సత్కారం

- ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై చారిత్రాత్మక నిర్ణయం: మంత్రి పొన్నం ప్రభాకర్
- విలీనం, పీఆర్సీపై కార్మిక సంఘాల హర్షం
- ప్రజా రవాణా బలోపేతానికి కార్మికులకు పిలుపు

2లో

## మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు

- యువతకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు
- నోటి క్యాన్సర్ మారథాన్‌లో మంత్రి పాల్గొనడం
- ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన అవసరం
- డ్రగ్స్, పొగాకు వినియోగంపై హెచ్చరిక




**హైదరాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ అమ్మకాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నగరంలోని రాయదుర్గం సత్వ నాలెడ్జ్ పార్క్‌లో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నోటి క్యాన్సర్ మారథాన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10 కిలోమీటర్ల పరుగును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకోవాలని సూచించారు. మంత్రి మాట్లాడుతూ యువత యోగా, వ్యాయామం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని అన్నారు. ఆరోగ్యకర జీవనశైలిని పాటించడం ద్వారా అనేక వ్యాధులను దూరంగా ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంపు అత్యవసరమని తెలిపారు.

మిగతా 2లో

# సోమాజిగూడలో 'మన్ కీ బాత్' వీక్షణ

- బీజేపీ నేతల సందడి
- ప్రధాని కార్యక్రమానికి కార్యకర్తల ఉత్సాహం
- కేంద్ర మంత్రులు, రాష్ట్ర నేతల సమక్షంలో వీక్షణ
- యువత, పర్యావరణం, సాంకేతికతపై ప్రధాని సందేశం



**హైదరాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలోని సోమాజిగూడ జయా గార్డెన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 133వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ నేతలు, కార్యకర్తలు కలిసి వీక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు కూడా హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు.

ప్రధాని ప్రసంగంలో స్వచ్ఛ ఇంధనం, నూతన ఆవిష్కరణలలో దేశం సాధిస్తున్న ప్రగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. యువత సాధిస్తున్న విజయాలను కొనియాడుతూ భవిష్యత్తు భారత్ నిర్మాణంలో వారి పాత్ర కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంచుకోవాలని ప్రధాని సూచించారు. డిజిటల్ సాధికారత ద్వారా దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

మిగతా 2లో



## జర్నలిస్టుల సంక్షేమంపై శ్రీనివాస్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

- అక్రిడేషన్ కార్డులపై సమానత్వం అవసరం
- జర్నలిస్టులకు హెల్త్ సదుపాయాల ప్రాధాన్యం
- డబుల్ బెడ్ రూమ్ హామీపై స్పష్టత

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్‌లో మహబూబ్ నగర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. సమావేశంలో జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.

మిగతా 2లో

# మరింత శక్తివంతంగా

- పార్టీ బలోపేతంపై కేటీఆర్ ధీమా
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరికలు
- హుజూర్‌నగర్ నేత పిల్లుట్ల రఘు గులాబీ గూటికి
- కాంగ్రెస్‌పై విమర్శల వర్షం



**హైదరాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో హుజూర్‌నగర్‌కు చెందిన నాయకుడు పిల్లుట్ల రఘు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 2023 సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలం మరింత పెరిగిందని అన్నారు. పార్టీ స్థాపన నుంచి 25 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న నేపథ్యంలో పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జనగణన-2027కు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ భారతి హోళికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక, సమాచార శాఖ కమిషనర్ సీహెచ్ ప్రియాంక తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైన సందర్భంగా అధికారులు ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ప్రతి కుటుంబం తాము నివసిస్తున్న ప్రదేశంలోనే వివరాలను నమోదు చేయాలని, లొకేషన్ మ్యాపింగ్ ఖచ్చితంగా చేయాలని అధికారులు సూచించారు. ఒక మొబైల్ నంబర్‌తో ఒకే కుటుంబం నమోదు చేయాలని, తుది సమర్పణకు ముందు వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని చెప్పారు. స్వీయ గణన చేసినప్పటికీ ఎన్యూమరేటర్ గృహ సందర్శన కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఎస్ఈ ఐడీ ఆధారంగా వివరాలు ధృవీకరించి అవసరమైతే సవరణలు చేస్తారని తెలిపారు. ఈ విధానం ద్వారా ఖచ్చితమైన జనాభా డేటా సేకరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. డిజిటల్ విధానాలను వినియోగిస్తూ పారదర్శక పరిపాలనను బలోపేతం చేసే దిశగా జనగణన-2027 ఒక కీలక మైలురాయిగా నిలవనుందని



ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికార యంత్రాంగం కోరింది.

# ప్రజావాణి సేవల విస్తరణకు సీఎం ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.

ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వెంటనే 2023 డిసెంబర్ 8న ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం అప్పటి నుంచి నిరంతరం కొనసాగుతోంది. ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను అధికారులు స్వీకరిస్తూ పరిష్కార చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కూడా ప్రజావాణి నిర్వహణ జరుగుతోంది. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించి వేగంగా పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయి.

దూర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. తరువాత దశలో మండల స్థాయికి కూడా ఈ సేవలను విస్తరించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీ నమోదు కావాలని, దాని పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని సీఎం స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి గడువులు నిర్దేశించి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఒకే డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి నోడల్ అధికారులను నియమించాలని, ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఒక స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు పై స్థాయికి చేరేలా ఆటో ఎస్కలేషన్ విధానం అమలు చేయాలని సూచించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం స్పష్టం చేశారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పనితీరును పర్యవేక్షించి ఆలస్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి సేవల వికేంద్రీకరణతో కిందిస్థాయిలోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, ప్రజలకు నమ్మకంగా ఉండే సేవలు అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# మంత్రి పొన్నం కు ఆర్టీసీ జేఎసి నేతల సత్కారం

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆర్టీసీ జేఎసి నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ చర్యలను అభినందించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం నెరవేరిందని సంఘాల నేతలు పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల కార్మికులకు భద్రత పెరిగిందని అభిప్రాయపడ్డారు.



కార్మికులకు గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహణ చేపట్టడం పట్ల సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. ఉద్యోగ హక్కుల పరిరక్షణకు ఇది కీలకమని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించడం పట్ల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం కార్మికుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు వెంకన్న, థామస్ రెడ్డి, అశ్వత్థామ రెడ్డి, హనుమంతు ముదిరాజ్ పాల్గొన్నారు. ఇతర సంఘాల ప్రతినిధులు కూడా హాజరై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల నేపథ్యంలో ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసే దిశగా కార్మికులు ఉత్సాహంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

చెడు అలవాట్ల వల్ల ప్రాణనష్టాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, గుట్కా వంటి హానికర పదార్థాలపై చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ 5 కిలో మీటర్ల పరుగును ప్రారంభించారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు 2 కిలోమీటర్ల పరుగును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ నాగ దీపిక, డాక్టర్ సౌమ్య, డాక్టర్ వినూత్న, డాక్టర్ చంద్ర కాంత్ పాల్గొన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.




# పర్యావరణవేత్తపై దాడిని ఖండించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ పర్యావరణవేత్త, జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణపై జరిగిన దాడి ఘటనపై మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వ్యక్తిపై దాడి జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను మంత్రి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వీకుల నుంచి వచ్చిన 70 ఎకరాల భూమిలో వేలాది మొక్కలు నాటి కృత్రిమ అడవిని సృష్టించిన ఆయన సేవలను మంత్రి ప్రశంసించారు. పర్యావరణ సమతుల్యత కోసం ఆయన చేస్తున్న కృషి సమాజానికి ఆదర్శమని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడే వ్యక్తిపై దాడి జరగడం సమాజానికి చెడు సంకేతమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. బాధ్యులను విడిచి పెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. సత్యనారాయణ త్వరగా కోలుకుని మళ్లీ పర్యావరణ సేవలో ముందుకు రావాలని మంత్రి ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణలో సమాజం మొత్తం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# సోమాజిగూడలో 'మన్ కీ బాత్' వీక్షణ

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ ప్రధాని సందేశాలు దేశ అభివృద్ధికి మార్గదర్శకమని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం అభిప్రాయాలు పంచుకుని పార్టీ బలోపేతంపై చర్చలు జరిపినట్లు సమాచారం. కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది.



# మరింత శక్తివంతంగా

(మొదటి పేజీ తరువాయి)

స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంటి నుంచి ప్రారంభమైన బీఆర్ఎస్ ప్రయాణం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసిందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి దిశగా పెద్దఎత్తున కార్యక్రమాలు అమలయ్యాయని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు చేసిన కేటీఆర్, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, పలు డిక్లరేషన్లు అమలులోకి రాలేదని ప్రశ్నించారు.

నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పాలనలో ఎదురైన సమస్యలను ప్రస్తావిస్తూ ఫ్లోరోసిస్ సమస్య, నీటి కొరత వంటి అంశాలను గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో మిషన్ భగీరథ వంటి పథకాల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలిపారు. అలాగే యాదాద్రి అభివృద్ధి, మెడికల్ కాలేజీలు, అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్ట్ వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ అభివృద్ధి దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.



# రాష్ట్రవ్యాప్తంగా రేపు ఎరువుల దుకాణాల బంద్

**డీలర్ల ఆందోళనకు పిలుపు**

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఎరువుల దుకాణాలు మూసివేయబడనున్నాయి. ఉత్పత్తిదారుల విధానాలను నిరసిస్తూ ఎరువుల డీలర్లు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు వెల్లడించారు.

డీలర్లకు అనుకూలంగా ఎరువుల సరఫరా వ్యవస్థలో మార్పులు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఎఫ్ఓఎల్ (FOL) విధానాన్ని అమలు చేయాలని, అలాగే లింక్ ప్రొడక్ట్ విధానం లేకుండా ఎరువులను అందించాలని కోరుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానాల వల్ల డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



డీలర్ల బంద్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల విక్రయాలు నిలిచిపోనున్నాయి. దీంతో రైతులు కొంతమేర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని భావిస్తున్నారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత తీవ్ర ఆందోళనలు చేపట్టే అవకాశముందని డీలర్లు హెచ్చరించారు.

# జర్నలిస్టుల సంక్షేమంపై శ్రీనివాస్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు జారీ చేయాలని పేర్కొన్నారు. చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు అనే తేడా చూపకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అక్రిడేషన్ కార్డులతో పాటు జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు.

ప్రస్తుతం అనేక జర్నలిస్టు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలికి తీయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, సమాజానికి వారు చేస్తున్న సేవను గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో చాలా మంది జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించినట్లు తెలిపారు. ఇంకా కొందరికి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం మారడం వల్ల అది సాధ్యం కాలేదని పేర్కొన్నారు. మళ్ళీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి జర్నలిస్టుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాలకులను కూడా ఈ అంశంపై ఐక్యంగా నిలబడి డిమాండ్ చేయాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.



# పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్

- చీఫ్ సెక్రటరీని మర్యాదపూర్వకంగా కలిసిన అధికారి
- బాధ్యతల స్వీకరణ అనంతరం తొలి భేటీ

- గ్రామీణ అభివృద్ధిపై చర్చ

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దాన కిషోర్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతలు చేపట్టిన అనంతరం ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. శాఖ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అభివృద్ధి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం.

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతం చేయడం, పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పథకాలు గ్రామ స్థాయికి సమర్థంగా చేరేలా చర్యలు తీసుకోవాల్సిన



అవసరంపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సమన్వయంతో పనులు నిర్వహించాలని చీఫ్ సెక్రటరీ సూచించినట్లు సమాచారం.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పంచాయతీల పనితీరును మెరుగుపరచడం వంటి అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ భేటీ ద్వారా శాఖ పనితీరులో వేగం పెరగడంతో పాటు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని భావిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## స్వీయ కథ రచన పోటీల్లో శ్రీ ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 26(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాహిత్య అకాడమీ ఖమ్మం ట్రస్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కథా కార్యశాల స్వీయ కథా రచన పోటీల్లో నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయిలో విద్యార్థుల్లో సృజనాత్మక కథారచనకు సంబంధించిన మెలుకువలు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఖమ్మంలో శని, ఆదివారాల్లో నిర్వహించారు. ఈ స్వీయ కథా రచన పోటీల్లో జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయానికి చెందిన విద్యార్థులు నున్నా రుషిత, మోదుగుల హాసిని, కణతాల సాయి వర్షిని ఈ కథ రచన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విజేతలు ప్రముఖ కథా రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, ప్రముఖ విద్యావేత్త, ఫెమా రాష్ట్ర కన్వీనర్ మువ్వ శ్రీనివాసరావు, ఐవీ రమణారావు చేతుల మీదుగా విద్యార్థులు ప్రతిభా పురస్కారం, బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బోడేపుడి కిరణ్, ప్రిన్సిపల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.




## ప్రపంచ శిల్ప కళా దినోత్సవం సందర్భంగా సాంప్రదాయ శిల్పులకు ఘన సన్మానం

**వనపర్తి,ఏప్రిల్26(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచ శిల్ప కళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాంప్రదాయ శిల్పులకు ఘన సన్మానం నిర్వహించారు.వంశపారంపర్యంగా శిల్పకళను కొనసాగిస్తూ శిల, దారు, సిమెంట్ లలో దేవతా విగ్రహాలను రూపొందిస్తున్న బైరోజు చంద్రశేఖర్, డా. బైరోజు శ్యాంసుందర్ సోదరులను వారి స్వగృహంలో సన్మానించారు.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. లలిత కళలలో శిల్పకళకు ప్రత్యేక స్థానం ఉందని, అలాంటి అరుదైన కళను పరిరక్షించి కొనసాగించడం సమాజం బాధ్యత అని అన్నారు. వృత్తిరీత్యా తెలుగు భాష ఉపాధ్యాయులైన బైరోజు సోదరులు తమ తీరిక సమయాల్లో శిల్పాలను రూపొందిస్తూ కళను సజీవంగా ఉంచుతున్నారని ప్రశంసించారు.ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు కర్నూలు, నల్గొండ, అదిలాబాద్ ప్రాంతాలలోని అనేక దేవాలయాలకు వీరు తయారు చేసిన విగ్రహాలు ప్రత్యేక గుర్తింపు పొందాయని తెలిపారు. వీరి శిల్పకళా సేవలను గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలతో పాటు చిన్నజీయర్ స్వామి, విద్యా నృసింహ భారతి, సిద్ధిలింగ మహాస్వామి వంటి ఆధ్యాత్మిక గురువులు కూడా వివిధ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలలో సన్మానించినట్లు ఆయన గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో రామన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ దేశి రాములు యాదవ్, గోపాలపేట ఎంఈఓ ఎస్. చంద్రశేఖర్, సామాజికవేత్త గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, బుచ్చిబాబు, శ్రీనివాస్, సాయి దరహాస్ తదితరులు పాల్గొన్నారు.శిలకు ప్రాణం పోసే శిల్పుల సేవలను సమాజం గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

## పెట్రోల్ డీజిల్ కొరతపై ఎంపీ వద్దిరాజు స్పందన

- ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్
- సత్వరమే సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి
- రేపటికల్లో సమస్య అధిగమిస్తామని హామీ*



**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 26(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్రంగా వేదిస్తున్న పెట్రోల్ డీజిల్ కొరతలపై బీఆర్ఎస్ ఎంపీ, పెట్రోల్, సహజ వాయు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పందించారు. ఆయా కంపెనీల సరఫరాదారులు, ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి పెట్రోల్ డీజిల్ కొరతలను తక్షణమే తీర్చాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం వరంగల్ జిల్లా పర్యటనలో ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్రను పలువురు పెట్రోల్ బంక్ ల యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులు కలిసి పెట్రోల్, డీజిల్ సరఫరాలో జరుగుతున్న జాప్యం, బంకుల్లో ఏర్పడుతున్న కొరత గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ఆయన అక్కడి నుంచే ఆయిల్ కంపెనీల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నిన్నటి నుంచి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లోని బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకోవడంతో రైతులు, చిరుద్యోగులు, వ్యాపారస్తులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆయా కంపెనీల ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. బంకుల యజమానులు డీడీలు చెల్లించినా కూడా ఆయిల్ సరఫరా చేయకుండా జాప్యం ఎందుకు చేస్తున్నారని..? ఆయన వారిని ప్రశ్నించారు. రేట్ల హెచ్చుతగ్గులను దృష్టిలో పెట్టుకుని కంపెనీలు కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. ఆయిల్ కొరత ఇలాగే కొనసాగితే తెలంగాణలో సమస్యలు తీవ్రమవుతాయని ఆయన సరఫరా కంపెనీలకు వివరించారు. తక్షణమే పెట్రోల్ డీజిల్ కొరతను నివారించాలని, సరఫరా వేగవంతం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయిల్ కంపెనీల ఉన్నతాధికారులు.. సోమవారానికల్లా సమస్య ను అధిగామిస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని.. ఎంపీ రవిచంద్ర కు బీపీసీఎల్, ఐఓసీఎల్, హెచ్పీసీఎల్ కంపెనీల ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# అకాలంలో నిలిచిపోయిన కలం..

- పాత్రికేయుడు గన్ను శ్రీనివాస్ మృతి పత్రికా లోకాన్ని కలచివేసింది

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రతిభావంతమైన పాత్రికేయుడు గన్ను శ్రీనివాస్ గుండెపోటుతో ఆకస్మికంగా కన్నుమూయడం పత్రికా లోకాన్ని తీవ్ర విషాదంలో ముంచేసింది. నిన్నటివరకు కలంతో సమాజ సమస్యలను వెలికి తీసిన ఆయన, ఒక్కసారిగా లేకపోవడం సహచరులను, స్నేహితులను కలచివేసింది.

తక్కువ సమయంలోనే తన ప్రత్యేక శైలితో వార్తలు రాస్తూ పాఠకుల మనసుల్లో స్థానం సంపాదించిన శ్రీనివాస్, నిబద్ధతతో పనిచేసే విలేకరిగా పేరు తెచ్చుకున్నారు. ప్రజల సమస్యలపై స్పష్టమైన స్వరం వినిపిస్తూ, నిజాయితీతో జర్నలిజం చేసిన ఆయన అకాల మరణం పత్రికా రంగానికి తీరని లోటుగా మారింది.

ఈ సందర్భంగా పలువురు నాయకులు, మిత్రులు ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. “ఇలాంటి నిబద్ధత కలిగిన పాత్రికేయుడిని కోల్పోవడం ఎంతో బాధాకరం” అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. మానవతా దృక్పథంతో డాక్టర్ పంజాల రాజయ్య కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పంజాల రాజయ్య, డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, పోలంపల్లి శ్రీనివాసరెడ్డి, నరేందర్, విజయేందర్ రెడ్డి, గన్ను రవి, గన్ను వినయ్, గన్ను సంపత్ తదితరులు పాల్గొని శ్రీనివాస్‌కు ఘన నివాళులు అర్పించారు.




# ఎండల తాకిడితో మూగజీవుల ఉగ్రరూపం..

- జమ్మికుంటలో జాగ్రత్తలు తప్పనిసరి

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

పట్టణంలో పెరుగుతున్న ఎండల తీవ్రత మధ్య మానవులు మాత్రమే కాదు, మూగజీవులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, వేసవి కాలంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, జంతువుల ప్రవర్తనలో మార్పులపై వైద్యులతో సమీక్ష నిర్వహించారు.





చెట్ల నరికివేత కారణంగా సహజ నివాసాలను కోల్పోయిన కోతులు, అలాగే నీరు-ఆహారం కొరతతో అలమటిస్తున్న వీధి కుక్కలు కాలనీల్లోకి వచ్చి సంచరిస్తున్నాయని ఆయన తెలిపారు. ఎండ తీవ్రత వల్ల ఈ జంతువులు అసహనానికి గురై, ఆగ్రహంతో ప్రవర్తించే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు వీటి బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉందని హెచ్చరించారు.

“ప్రస్తుతం పరిస్థితుల్లో జంతువుల ప్రవర్తనను తక్కువ అంచనా వేయకూడదు. అవి దాడి చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా కుక్కలు లేదా కోతుల దాడికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సూచన మేరకు టీకాలు తీసుకోవడం తప్పనిసరి” అని చైర్మన్ స్పష్టం చేశారు.

ఇకపోతే, ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీటి పాత్రలు ఏర్పాటు చేసి మూగజీవాలకు తాగునీరు అందించాలన్నారు. చెట్ల సంరక్షణపై దృష్టి పెట్టాలని, పచ్చదనం పెంపు ద్వారా జంతువులకు సహజ వాతావరణం కల్పించవచ్చని సూచించారు.

మున్సిపల్ యంత్రాంగం తరఫున వీధి కుక్కల నియంత్రణ, శుభ్రత చర్యలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా జాగ్రత్తలు పాటిస్తూ సహకరించాలని కోరారు.

# కన్యకా పరమేశ్వరి ఆశయాలు అందరికీ ఆదర్శం

- చైర్మన్ ప్రశాంత్ కుమార్

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా పట్టణంలో భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు వైభవంగా జరిగాయి.



ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక హోమంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి పట్టు చీరలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

తదుపరి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో కూడా చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమేకాక, సమాజానికి ఆదర్శంగా నిలిచిన వీరనారి అని కొనియాడారు. అమ్మవారి ఆశయాలు ధర్మం, న్యాయం, సేవ అనే విలువలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.

జమ్మికుంట పట్టణ ప్రజలు మరియు పరిసర ప్రాంతాల వారు అమ్మవారి ఆశయ సాధనలో భాగస్వాములై సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బచ్చు మాధవి శివశంకర్, చందరాజు, స్వామిశెట్టి అఖిలాండం రాజేందర్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల హృదయాల్లో నిలిచిన సీఐకి ఘన గౌరవం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజల భద్రత కోసం అంకితభావంతో పని చేసి, గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేసిన రూరల్ సీఐ లక్ష్మీనారాయణ బదిలీపై వెళ్తుండటంతో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఆయనకు గౌరవార్థం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ రామారావు శాలువాతో సత్కరించి, దేవుని చిత్రపటాన్ని బహుకరించారు. అలాగే శ్రీరాముల వారి కళ్యాణానికి సంబంధించిన ముత్యాల తలంబ్రాలను అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగుతూ, సీఐ సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు ప్రశంసలు కురిపించారు.




చైర్మన్ రామారావు మాట్లాడుతూ, సీఐ లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి రూరల్ పరిధిలోని అనేక గ్రామాల్లో ఆధునిక సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా కృషి చేశారని గుర్తుచేశారు. ఈ చర్యల వల్ల గ్రామాల్లో నేరాలపై నియంత్రణ పెరిగి, ప్రజల్లో భద్రతాభావం పెరిగిందని పేర్కొన్నారు.

అలాగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట పోలీసు వ్యవస్థను అమలు చేసి, ప్రతి గ్రామంలో శాంతి భద్రతలను కాపాడడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ముఖ్యంగా ఇల్లందకుంటలో జరిగిన శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీగా భక్తులు పాల్గొన్నప్పటికీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమర్థవంతంగా బందోబస్తు నిర్వహించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని అన్నారు.

ఇలాంటి సేవాభావం కలిగిన అధికారి బదిలీపై వెళ్తుండటం స్థానిక ప్రజలకు బాధాకరమని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేష్, కిరణ్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొని సీఐ లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ వార్డు సభ్యుడు బీరయ్య లక్ష్మి కూతురు వివాహం ఘనంగా నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు అశోక్ రెడ్డి, దొడగుంటపల్లి గ్రామ సర్పంచ్ పెంటయ్య, పామిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మంజుల శ్రీశైలం, రాఘవేందర్, సుధాకర్, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# మణిగిల్ల గ్రామంలో మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి

**-- సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్**

**పెద్దమందడి,ఏప్రిల్26( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు మరో ముఖ్యమైన చర్యగా, ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్ సందర్భంగా చౌట చెరువు పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్ మరియు ఇతర గ్రామ ప్రతినిధులతో కలిసి చౌట చెరువును సందర్శించారు. గ్రామ ప్రజలు పండుగలు, దినాల కార్యక్రమాలు తరచూ చెరువు కట్ట వద్ద నిర్వహించడం జరుగుతుండగా, వేసవిలో ఎండలు, వర్షాకాలంలో వర్షాలు కారణంగా వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గుర్తించారు .ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, చెరువు వద్ద మట్టి వేసి స్థలం సమతలీకరణ (లెవెలింగ్) చేసి, ప్రజలకు సౌకర్యంగా ఉండేలా శాశ్వత రేకుల షెడ్ నిర్మాణానికి సర్పంచ్ శ్రీకారం చుట్టారు. పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అదేవిధంగా, గ్రామ స్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్త మరియు కంపచెట్ల తొలగింపు పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ చర్యల ద్వారా గ్రామంలో పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యం కలగనుంది .ఈ కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రామ్ రెడ్డి, సుంచరమోని వెంకటయ్య, గరే మోని కొములయ్య, ముప్పూరి రాములు, జి. బాలరాజు, ఎస్. మల్లీ, నరేందర్ గౌడ్ (మాజీ సింగిల్ విండో డైరెక్టర్), రామిరెడ్డి (మాజీ ఉప సర్పంచ్), ముప్పూరి బుచ్చయ్య, ఆర్. ఆనంద్ రెడ్డి, ప్రేమ్ కుమార్ రెడ్డి, కుపేందర్ రెడ్డి, బీకే శ్రీకాంత్ రెడ్డి, గుంటి శివకృష్ణ సాగర్, ఎం. సాయి కుమార్, ముప్పూరి నాగరాజు, బోడి గణేష్, కుమ్మరి బుచ్చయ్య, వడ్డే చంద్రయ్య, మోడీ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటుతో మూడేళ్ల బాలుడు మృతి

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని దామేర గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పాముకాటుతో మూడేళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.




స్థానిక ఎస్సై ఇ. నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం, దామేర గ్రామానికి చెందిన వంగ అనిల్, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం చిన్న కుమారుడు మనవిత్ యాదవ్ (3) ఇంటి వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు పాము కాటు వేసింది. కాటు వేసిన విషయాన్ని బాలుడు తల్లికి తెలియజేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించాలని సూచించారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, సిబ్బంది వేగంగా స్పందించి బాలుడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ వైద్యులు పరిశీలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఈ ఘటనతో బాలుడి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్న వయస్సులోనే బాలుడు ప్రాణాలు కోల్పోవడం గ్రామస్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

- **ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన – సమస్యల పరిష్కారానికి హామీ.**



**దమ్మపేట, ఏప్రిల్ 26(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని మారుమూల కొండరెడ్ల గిరిజన గ్రామాలైన పూసుకుంట, కట్కూరులో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, పురోగతిపై అధికారులకు సూచనలు చేశారు. అలాగే స్థానిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడ పనులను కూడా ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాట్ల రాజిరెడ్డి, ఉపసర్పంచ్ కోండ్రు బాబురావు, మడకం రాజేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామంలో పండుగ వాతావరణం



**ఎల్కతుర్తి, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పెద్ద పండుగ (పంచమ వార్షికోత్సవం) ఆదివారం భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరగనున్న ఈ ఉత్సవాల సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం గౌడ సంఘం సభ్యులు జలబిందెలతో ప్రత్యేక భక్తి ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ వేషధారణలో గ్రామ వీధుల గుండా సాగిన ఈ ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆలయానికి చేరుకున్న భక్తులు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి జలాభిషేకం చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు శాస్త్రోక్తంగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు నైవేద్యాలు సమర్పిస్తూ తల్లి ఆశీస్సులు కోరుకున్నారు. తరువాత పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలు మోసుకొని హారతులు ఇస్తూ భక్తి గీతాలు ఆలపించారు. పిల్లలు, యువతులు కూడా ఉత్సాహంగా పాల్గొని ఉత్సవాలకు ప్రత్యేక శోభ తీసుకువచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గౌడ సంఘం ఆధ్వర్యంలో తాగునీరు, ప్రసాదం, పార్కింగ్ వంటి అన్ని సదుపాయాలు కల్పించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు శుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రానున్న రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# హుజురాబాద్‌ను చెత్త కుప్పగా మార్చే కుట్ర ఆపాలి: జక్కని సంజయ్

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ ప్రాంతాన్ని చెత్త మైదానంగా మార్చే ప్రయత్నాన్ని వెంటనే నిలిపివేయాలని బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. డంపింగ్ యార్డు ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయకపోతే భారీ స్థాయిలో ప్రజా ఉద్యమం చేపట్టి, అవసరమైతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వరకు వెళ్లి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



హుజురాబాద్ పట్టణంలోని బీసీ ఆజాది ఫెడరేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ— జనావాసాల మధ్యలో, పచ్చని పంట పొలాల మధ్యలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం ప్రజల ఆరోగ్యాన్ని, భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని మండిపడ్డారు. విద్యుత్ ఉత్పత్తి పేరుతో విష వాయువులు, ప్రమాదకర రసాయనాలు విడుదల చేసే ప్లాంట్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం ప్రజలపై దాడితో సమానమని పేర్కొన్నారు.

హుజురాబాద్‌ను లక్ష్యంగా ఎంచుకోవడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని ఆరోపిస్తూ, ఇలాంటి ప్రాజెక్టులు ప్రజలు నివసించని దూర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ ప్రజలు ఓట్ల కోసం మాత్రమే గుర్తు చేసుకునే వారు కారని, వారి ప్రాణాలకు విలువ లేదనే భావనతో తీసుకునే నిర్ణయాలను తీవ్రంగా ఖండించారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో హుజురాబాద్ ప్రజలు చేసిన త్యాగాలను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. వెంటనే ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే రోడ్లపై భారీ నిరసనలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

"ఇది అభివృద్ధి కాదు —— నాశనం. ఇది ప్రాజెక్ట్ కాదు —— ప్రజలపై విష దాడి" అంటూ ఆయన తీవ్రంగా స్పందించారు. హుజురాబాద్ ప్రజలు మౌనంగా ఉండరని, ప్రజల ఆరోగ్యం మీద రాజకీయం చేస్తే సహించబోమని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్నారు:

ఈ సమావేశంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నడిగోటి రమేష్, ప్రధాన కార్యదర్శి మమునూరి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు కొల్లిపాక క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి పంజాల వెంకటేశ్వర్లు గౌడ్, కందుకూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యాల వేళ ఆయిల్ సంక్షోభం.!

- **సత్తుపల్లిలో పెట్రోల్, డీజిల్ తీవ్ర కొరత.**
- **బంక్‌ల వద్ద గంటల తరబడి క్యూలు.**





**సత్తుపల్లి, ఏప్రిల్ 26(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లిలో ఆదివారం సాయంత్రం నుంచే అన్ని పెట్రోల్ బంక్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పూర్తిగా ఖాళీ కావడంతో ఆయిల్ సంక్షోభం నెలకొంది. అవసరమైన సమయంలో సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వారం వివాహాలు, ఇతర శుభకార్యాలు అధికంగా ఉండటంతో పరిస్థితి మరింత విషమించింది. దూర ప్రయాణాలు చేసేవారు మధ్యలోనే నిలిచిపోవాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఆయిల్ దొరకక ప్రయాణాలు రద్దు చేసుకుంటున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అత్యవసర పనులతో బయలుదేరిన వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని బంక్‌ల వద్ద ఆదివారం తెల్లవారుజామున నుంచే వాహనదారులు బారులు తీరుతున్నారు. గంటల తరబడి క్యూలో నిల్చున్నా ఆయిల్ దొరకక పలువురు నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొంతమంది రాత్రి వేళల్లోనే బంక్‌ల వద్ద కాచుకుని నిలబడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆయిల్ కొరత ప్రభావం రోజు వారి జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. ఉద్యోగాలకు వెళ్లే ఉద్యోగస్థులు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ కూలీలు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు వాహనాలు నడపలేక ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు వాహనాలు దొరకక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. డీజిల్ కొరతతో వ్యవసాయ రంగం కూడా తీవ్రంగా దెబ్బతింటోంది. ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు నిలిచిపోవడంతో సాగు పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంధన సరఫరా లేక రవాణా రంగం కుదేలవుతోంది. సరుకు రవాణా అంతరాయం కలగడంతో ధరలు పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆయిల్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించకపోతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా

**– హుజురాబాద్‌లో ప్రత్యేక పూజలు**

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రణవ్ వొడితల గారు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణవ్ వొడితల గారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని గారు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# సత్తుపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన పిడమర్తి రవి

**సత్తుపల్లి,ఏప్రిల్26(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని మర్లపాడు, కల్లూరు, వేంసూరు, తల్లాడ మండలాల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆయా మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించి స్థానిక ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం వంటి మౌలిక వసతులపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, ప్రతి అంశాన్ని గమనికలోకి తీసుకున్న ఆయన, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాల అమలు స్థితిగతులపై కూడా సమీక్ష నిర్వహించి, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళా సంఘాలకు ఆర్థిక పరంగా మరింత బలోపేతం చేయడం, రైతులకు అవసరమైన సాయం అందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. గ్రామాభివృద్ధి సమగ్రంగా జరగాలంటే ప్రజల సహకారం అవసరమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.



పర్యటన సందర్భంగా పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని వివిధ అంశాలపై వివరాలు అందించారు. గ్రామ స్థాయి సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో పనిచేస్తామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా కృషి చేస్తామని డాక్టర్ పిడమర్తి రవి వెల్లడించారు.

# మోంట్రా ఎలక్ట్రిక్ కొత్త వాహనాలు విడుదల




మురుగప్ప గ్రూప్‌కు చెందిన మోంట్రా ఎలక్ట్రిక్ తన ఎలక్ట్రిక్ చిన్న వాణిజ్య వాహన విభాగంలో రెండు కొత్త నమూనాలను విడుదల చేసింది. ఎవియేటర్ శ్రేణిలో భాగంగా ఎవియేటర్ 350 (32 కిలోవాట్ గంటలు), ఎవియేటర్ 350ఎల్ ప్లస్ (50 కిలోవాట్ గంటలు) అనే వాహనాలను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది.

నగరాల్లో స్వల్ప దూర రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 32 కిలోవాట్ గంటల వాహనం రోజుకు సుమారు 140 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీనిని చివరి దశ రవాణాకు అనుకూలంగా తీర్చిదిద్దారు. ఇక సుదూర రవాణా అవసరాల కోసం రూపొందించిన 50 కిలోవాట్ గంటల వాహనం వాస్తవ పరిస్థితుల్లో 200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించగలదు. అధికారికంగా ఇది 300 కిలోమీటర్లకు పైగా ప్రయాణ పరిధిని అందిస్తుంది.

ఈ వాహనాల రూపకల్పనకు విస్తృత పరిశోధన ఆధారంగా పని చేసినట్లు సంస్థ వెల్లడించింది. సుమారు 600 వాహనాలు 65 లక్షల కిలోమీటర్ల ప్రయాణ డేటాను విశ్లేషించి వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వీటిని రూపొందించారు. ముందుగా విడుదలైన ఇదే శ్రేణి వాహనం తక్కువ కాలంలోనే మార్కెట్‌లో మంచి స్థానం సంపాదించడం గమనార్హం.

ధరల విషయానికి వస్తే, 32 కిలోవాట్ గంటల వాహనం ప్రారంభ ధర రూ. 14.58 లక్షలు కాగా, 50 కిలోవాట్ గంటల వాహనం ధర రూ. 16.86 లక్షలుగా నిర్ణయించారు. నిర్వహణ ఖర్చులను తగ్గించి, పెట్టుబడిపై లాభాలను పెంచే విధంగా ఈ వాహనాలను రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

ఈ ఎలక్ట్రిక్ వాహనాలు అధిక పనితీరుతో పాటు తక్కువ నిర్వహణ ఖర్చుతో పనిచేస్తాయని, రవాణా రంగంలో ముఖ్యంగా మునిసిపల్ సేవలు మరియు నగరాల మధ్య సరుకు రవాణాకు ఇవి సమర్థవంతమైన పరిష్కారంగా మారనున్నాయని సంస్థ విశ్వాసం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఈ వాహనాలు విక్రయ కేంద్రాల్లో అందుబాటులోకి రానున్నాయి.

# జియో నుంచి యూత్, గేమింగ్ ప్రత్యేక ప్లాన్




టెలికాం రంగంలో అగ్రగామిగా ఉన్న రిలయన్స్ జియో యూత్, గేమింగ్ ప్రియులను లక్ష్యంగా చేసుకుని కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను విడుదల చేసింది. అధిక డేటా వినియోగించే వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని టెలికాం సేవలతో పాటు డిజిటల్ సౌకర్యాలను కలిపి ఈ ప్లాన్‌ను రూపొందించింది.

ఈ ప్లాన్ ధర రూ. 459 కాగా, 28 రోజుల వ్యాలిడిటీతో అందుబాటులో ఉంటుంది. మొత్తం 61 జీబీ డేటాను వినియోగదారులకు అందిస్తున్నారు. రోజుకు 2 జీబీ హైస్పీడ్ డేటాతో పాటు అదనంగా 5 జీబీ డేటా లభిస్తుంది. రోజువారీ డేటా పరిమితి పూర్తయ్యాక ఇంటర్నెట్ వేగం 64 కిలోబిట్లు ప్రతి సెకనుకు తగ్గుతుంది. అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 సందేశాల సౌకర్యం కూడా ఇందులో ఉన్నాయి. అర్హులైన వినియోగదారులకు ఐదో తరం మొబైల్ నెట్‌వర్క్‌లో అపరిమిత డేటా వినియోగం లభిస్తుంది.

టెలికాం ప్రయోజనాలతో పాటు పలు డిజిటల్ సేవలను కూడా ఈ ప్లాన్‌లో చేర్చారు. స్నాప్‌చాట్ ప్లస్ సభ్యత్వంతో పాటు, జియో హాట్‌స్టార్ మొబైల్ సభ్యత్వం మూడు నెలల పాటు ఉచితంగా అందుతుంది. అలాగే జియో గేమ్స్ సేవలు, ఫ్యాన్‌కోడ్ యాక్సెస్ వంటి అదనపు ప్రయోజనాలు కూడా లభిస్తాయి. వినియోగదారులకు జియో మేఘ నిల్వలో 50 జీబీ స్థలం కూడా కేటాయించారు.

ఈ ప్లాన్‌లో ముఖ్య ఆకర్షణగా గూగుల్ జెమిని ప్రోకు 18 నెలల ఉచిత యాక్సెస్‌ను అందిస్తున్నారు. దీనితో పాటు 5 టెరాబైట్ల మేఘ నిల్వ సౌకర్యం కూడా ఉంటుంది. ఈ సదుపాయాల మొత్తం విలువ సుమారు రూ. 35,100 వరకు ఉంటుందని సంస్థ పేర్కొంది.

అధిక డేటా, వినోద సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత సాధనాలు, మేఘ నిల్వ వంటి అన్ని సౌకర్యాలను ఒకే ప్లాన్‌లో అందించడం ద్వారా యువతకు ఇది మంచి ఎంపికగా నిలుస్తుందని జియో భావిస్తోంది.

# రిలయన్స్‌కు రూ.95,610 కోట్ల లాభం.. కొత్త రికార్డు

ముంబై, ఏప్రిల్ 26 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): భారత కార్పొరేట్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని రాస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2026 ఆర్థిక సంవత్సరంలో రూ.95,610 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. దీంతో 10 బిలియన్ డాలర్ల వార్షిక లాభ మార్క్‌ను దాటిన తొలి భారతీయ సంస్థగా నిలిచింది. ముఖేష్ అంబానీ నేతృత్వంలోని ఈ సంస్థ గత ఏడాది లాభాలతో పోలిస్తే సుమారు 18 శాతం వృద్ధిని సాధించింది.

అయితే నాలుగో త్రైమాసికంలో కొంత మందగమనం కనిపించింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.19,407 కోట్లుగా ఉన్న లాభం ఈసారి 12.6 శాతం తగ్గి రూ.16,971 కోట్లకు చేరింది. ముఖ్యంగా ఆయిల్‌టుకెమికల్స్ విభాగంలో బలహీనత, పెరిగిన వ్యయాలు ఈ తగ్గుదలకు కారణమయ్యాయి.

అయినప్పటికీ వినియోగదారుల ఆధారిత వ్యాపారాలు కంపెనీకి బలంగా నిలిచాయి. ముఖ్యంగా జియో ప్లాట్‌ఫామ్స్, రిలయన్స్ రీటైల్ విభాగాలు వేగంగా వృద్ధి చెందుతూ లాభాలను పెంచాయి. దేశవ్యాప్తంగా 20,000 దుకాణాల మైలురాయిని దాటడం రీటైల్ విభాగానికి ముఖ్య ఘట్టంగా నిలిచింది.

నాలుగో త్రైమాసికంలో సంస్థ స్థూల ఆదాయం 12.9 శాతం పెరిగి రూ.3,25,290 కోట్లకు చేరుకోగా, మొత్తం ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 9.8 శాతం వృద్ధితో రూ.11,75,919 కోట్లకు చేరింది. ఈబిటిడిఏ కూడా 13.4 శాతం పెరిగి రూ.2,07,911 కోట్లకు నమోదైంది.

స్టాక్ మార్కెట్ పరంగా ఈ ఏడాది కంపెనీ షేర్ ధరలో కొంత పడిపోయినా, మొత్తం మార్కెట్ విలువ రూ.18 లక్షల కోట్లకు పైగా ఉండి దేశంలో అత్యంత విలువైన సంస్థగా తన స్థానాన్ని కొనసాగిస్తోంది. ఇతర కంపెనీలతో పోలిస్తే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లాభాల పరంగా వెనుకబడ్డాయి.

మొత్తంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తన విస్తృత వ్యాపార వ్యూహాలతో ఇతర భారతీయ సంస్థలను అధిగమిస్తూ లాభాల్లో కొత్త రికార్డును నెలకొల్పింది.




# తక్కువ ధరల రహస్యం ఇదే




మధ్యతరగతి కుటుంబాలకు సూపర్ మార్కెట్ అనగానే గుర్తొచ్చే డీమార్ట్ తక్కువ ధరలతో మార్కెట్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇతర బ్రాండ్లతో పోలిస్తే తక్కువ ధరకు నిత్యావసర వస్తువులను అందించడం వెనుక ఉన్న వ్యూహాలు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి.

డీమార్ట్ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి తమ సొంత బ్రాండ్ ఉత్పత్తులు. మార్కెట్లో ఉన్న ప్రముఖ కంపెనీల వస్తువులతో పాటు, పప్పులు, బియ్యం, నూనెలు, స్నాక్స్, శుభ్రపరిచే పదార్థాలను స్వంత బ్రాండ్ పేరుతో విక్రయిస్తుంది. ఇతర కంపెనీలు ప్రకటనలపై భారీగా ఖర్చు చేస్తే, డీమార్ట్ ఆ ఖర్చును తగ్గించి వినియోగదారులకు తగ్గింపు రూపంలో అందిస్తుంది.

కిరాణా వస్తువులతో పాటు దుస్తుల విభాగంలో కూడా డీమార్ట్ తన సొంత బ్రాండ్‌ను అందిస్తోంది. నాణ్యతలో రాజీపడకుండా తక్కువ ధరలకు అందించడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకుంటోంది.

మరో ముఖ్య కారణం భారీ స్థాయిలో కొనుగోలు చేయడం. తయారీదారుల నుంచి నేరుగా పెద్ద మొత్తంలో సరుకును కొనుగోలు చేయడం వల్ల తక్కువ ధరకు వస్తువులు లభిస్తాయి. ఈ లాభాన్ని వినియోగదారులకు అందించడం ద్వారా ధరలను తగ్గిస్తోంది.

నిర్వహణ ఖర్చులను కూడా డీమార్ట్ కట్టుదిట్టంగా నియంత్రిస్తుంది. స్టోర్లలో అధిక అలంకరణలు లేకుండా సరళంగా నిర్వహించడం, చాలా చోట్ల సొంత భవనాలను ఉపయోగించడం వల్ల అద్దె ఖర్చు తగ్గుతుంది. ఈ ఆదా వినియోగదారులకు ప్రయోజనంగా మారుతుంది.అదనంగా, ఇతర కంపెనీల ఉత్పత్తులను స్టోర్లలో ఉంచేందుకు స్లాట్ రుసుము తీసుకోవడం, సరఫరాదారులకు వేగంగా చెల్లింపులు చేయడం ద్వారా మరిన్ని రాయితీలు పొందుతుంది. ఈ మొత్తం వ్యూహాల సమ్మేళనం వల్లనే డీమార్ట్ 'తక్కువ ధర - మంచి నాణ్యత' అనే సూత్రంతో దేశవ్యాప్తంగా అత్యంత విజయవంతమైన రిటైల్ శ్రేణిగా ఎదిగింది.

# 70 కిలోమీటర్ల మైలేజ్ బైక్

మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలో మంచి మైలేజ్ ఇచ్చే బైక్‌గా హీరో హెచ్‌ఎఫ్ 100 మంచి గుర్తింపు పొందుతోంది. హీరో మోటోకార్ప్ తయారు చేసిన ఈ బైక్ రోజువారీ ప్రయాణాలకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపయోగానికి అనువైనదిగా నిలుస్తోంది. ఈ బైక్‌లో 97.2 సీసీ సామర్థ్యం గల గాలి చల్లబడే నాలుగు స్ట్రోక్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంటుంది. ఇది 8000 ఆర్‌పీఎం వద్ద 5.9 కిలోవాట్ల శక్తిని, 6000 ఆర్‌పీఎం వద్ద 8.05 న్యూటన్ మీటర్ల టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆధునిక ఇంధన ఇంజెక్షన్ సాంకేతికతతో పెట్రోల్ వినియోగం తగ్గి, ఇంజిన్ దీర్ఘకాలం పనిచేస్తుంది. నాలుగు వేగాల గేర్ వ్యవస్థతో నగర ట్రాఫిక్‌లో సులభంగా నడపవచ్చు.

మైలేజ్ విషయంలో ఈ బైక్ లీటరుకు సుమారు 70 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. 735 మిల్లీమీటర్ల పొడవైన సీటుతో కుటుంబంతో కలిసి ప్రయాణించేందుకు అనుకూలంగా ఉంటుంది. కేవలం 110 కిలోల బరువు ఉండటంతో రద్దీ రోడ్లపై కూడా సులభంగా నియంత్రించవచ్చు.

భద్రతా పరంగా సైడ్ స్టాండ్ పెట్టినప్పుడు ఇంజిన్ ఆగిపోవడం, బైక్ పడిపోతే స్వయంగా ఇంజిన్ ఆగే వ్యవస్థ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ముందు టెలిస్కోపిక్ సస్పెన్షన్, వెనుక రెండు దశల సర్దుబాటు షాక్ అబ్జార్బర్లతో గుంతల రోడ్లపై కూడా ప్రయాణం సౌకర్యంగా ఉంటుంది. 165 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్ ఉండటం వల్ల ఎత్తుపల్లాలపై ఇబ్బంది ఉండదు.

ధర విషయానికి వస్తే, ఈ బైక్ హైదరాబాద్‌లో ఎక్స్‌షోరూమ్ ధర సుమారు రూ. 61,589గా ఉంది. బ్లూబ్లాక్, రెడ్‌బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. తక్కువ ఖర్చుతో మంచి మైలేజ్ ఇచ్చే బైక్ కోసం చూస్తున్న వారికి ఇది ఉత్తమ ఎంపికగా నిలుస్తోంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆప్ ఎంపీల ఫిరాయింపుపై రాజ్యసభలో వివాదం

- ఏడుగురు ఎంపీల అనర్హతపై పిటిషన్
- ఫిరాయింపు చట్టం ఉల్లంఘన ఆరోపణలు
- విలీనం వాదనపై బీజేపీ వైఖరి





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరిన ఘటనపై రాజకీయంగా తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు పిటిషన్ సమర్పించి, ఫిరాయించిన సభ్యులను అనర్హులుగా ప్రకటించాలని కోరారు.

ఈ సందర్భంగా సంజయ్ సింగ్ మాట్లాడుతూ, ఆ ఎంపీల చర్య పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టానికి విరుద్ధమని ఆరోపించారు. ప్రజల తీర్పును అవమానించిన ఈ చర్యపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఆప్ పార్టీకి చెందిన రాఘవ్ చడ్డా, అశోక్ మిత్తల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్త, విక్రమ్ సాహ్నీ, స్వాతి మలివాల్ పార్టీని వీడి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ పరిణామం ఆప్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

ఈ చేరికలను సమర్థిస్తూ రాఘవ్ చడ్డా కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ప్రకారం ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల సభ్యులు వేరే పార్టీలో చేరితే అది విలీనంగా పరిగణించవచ్చని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభలో ఆప్‌కు ఉన్న 10 మందిలో ఏడుగురు మారడంతో ఇది విలీనంగా పరిగణించాలన్నారు.

అయితే ఈ వాదనను సంజయ్ సింగ్ ఖండించారు. ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని, ముఖ్యంగా పంజాబ్ ప్రజలను మోసం చేసినట్లేనని తీవ్రంగా విమర్శించారు. ఫిరాయించిన వారిలో ఎక్కువ మంది పంజాబ్ నుంచి ఎన్నికైనవారేనని గుర్తు చేశారు. ఈ పరిణామంపై రాజకీయ వర్గాల్లో చర్చలు ముదురుతున్నాయి. ఫిరాయింపు చట్టం ప్రకారం ఈ కేసులో తీసుకునే నిర్ణయం భవిష్యత్ రాజకీయాలకు కీలకంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వైట్‌హౌస్ విందులో కాల్పులు ట్రంప్ సురక్షితం

- కార్యక్రమంలో కలకలం సృష్టించిన దుండగుడు
- సెక్యూరిటీ వేగంగా స్పందించి ప్రమాదం తప్పింపు
- ప్రెస్ సెక్రటరీ వ్యాఖ్యలపై చర్చ





**వాషింగ్టన్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికాలో వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందు సందర్భంగా కాల్పుల ఘటన చోటుచేసుకుని ఉద్రిక్తత నెలకొంది. కార్యక్రమానికి హాజరైన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సురక్షితంగా బయటపడ్డారు.

వివరాల ప్రకారం కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి కాల్పులకు పాల్పడడంతో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. భద్రతా సిబ్బందిపై లక్ష్యంగా కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు.

దాడిలో ఒక భద్రతా అధికారి లక్ష్యంగా మారినప్పటికీ బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్ ధరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ సిబ్బంది అధ్యక్షుడిని భద్రతా వలయంలోకి తీసుకుని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

ఈ ఘటనకు కొద్దిసేపటి ముందే ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. కార్యక్రమంలో "షాట్లు పేలబోతున్నాయి" అనే వ్యాఖ్య రూపకంగా చేసినప్పటికీ తరువాత నిజంగానే కాల్పులు జరగడం ఆసక్తికరంగా మారింది.

అధ్యక్షుడు ట్రంప్ ఈ ఘటనపై స్పందిస్తూ దాడి తనపై లక్ష్యంగా జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. మొదట శబ్దాన్ని సాధారణంగా భావించినప్పటికీ వెంటనే ప్రమాదాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి తీవ్ర గాయాలు జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దాడి చేసిన వ్యక్తి ఉద్దేశాలు, నేపథ్యంపై విచారణ కొనసాగుతోందని భద్రతా వర్గాలు వెల్లడించాయి.

# పాకిస్థాన్‌లో తీవ్రమైన ఆహార సంక్షోభం

- టాప్–10 సంక్షోభ దేశాల్లో స్థానం
- 1.1 కోట్ల మంది తీవ్ర ప్రభావం
- వాతావరణ విపత్తులే ప్రధాన కారణం



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** పొరుగు దేశం పాకిస్థాన్‌లో ఆహార సంక్షోభం తీవ్రమైంది. ఐక్యరాజ్యసమితి మద్దతుతో విడుదలైన "2026 గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్" ప్రకారం ప్రపంచంలో అత్యంత తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో పాకిస్థాన్ కూడా ఉంది. నివేదిక ప్రకారం దేశంలో సుమారు 1.1 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార కొరతతో బాధపడుతున్నారు. అందులో 93 లక్షల మంది సంక్షోభ స్థితిలో, 17 లక్షల మంది అత్యవసర స్థితిలో ఉన్నట్లు వర్గీకరించారు.

పాకిస్థాన్‌లో ఈ పరిస్థితికి ప్రధాన కారణం తీవ్రమైన వాతావరణ మార్పులేనని నివేదిక వెల్లడించింది. 2025లో సంభవించిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల వల్ల 60 లక్షల మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారు. పంట పొలాలు, మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో ఆహార ఉత్పత్తి తగ్గిపోయింది. బలూచిస్థాన్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతాల్లో పోషకాహార లోపం మరింత తీవ్రమైందని నివేదిక పేర్కొంది. అయితే తాజా సంవత్సరానికి సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు ఇంకా అందుబాటులో లేవని తెలిపింది.

2026లో పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం సుమారు 6 శాతానికి పెరిగే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. దీనివల్ల ఆహార వ్యవస్థపై మరింత ఒత్తిడి పడే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంది. గతంలో 43 జిల్లాల్లో మాత్రమే నిర్వహించిన సర్వేను ఈసారి 68 జిల్లాలకు విస్తరించడంతో సంక్షోభ తీవ్రత మరింత స్పష్టంగా బయటపడిందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. పరిస్థితిని ఎదుర్కొనేందుకు తక్షణ చర్యలు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మహిళల భద్రతకు కఠిన చర్యలు: ప్రధాని మోదీ

- బోంగావ్‌లో ప్రచార సభలో ప్రధాని వ్యాఖ్యలు
- టీఎంసీపై తీవ్ర విమర్శలు
- బీజేపీ విజయంపై ధీమా వ్యక్తం



**బోంగావ్, ఏప్రిల్ 26 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోంగావ్‌లో నిర్వహించిన సభలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మే 4 తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తే నేరస్తులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా సందేశ్‌ఖాలీ బాధితురాలు, ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి బీజేపీ టికెట్లు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నిర్ణయం ద్వారా మహిళల పట్ల పార్టీ నిబద్ధత స్పష్టమవుతుందని తెలిపారు.

టీఎంసీ ప్రభుత్వం గూండాలకు అండగా నిలుస్తోందని మోదీ ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు భయంతో జీవిస్తున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇకపై ప్రజలు ఈ పరిస్థితిని సహించబోరని పేర్కొన్నారు.

టీఎంసీ పాలనను 'జంగిల్ రాజ్'గా అభివర్ణిస్తూ రాష్ట్రాన్ని ఈ పరిస్థితి నుంచి విముక్తి చేస్తామని చెప్పారు. మొదటి దశ పోలింగ్‌లోనే ప్రజలు మార్పు కోరుకున్నారని, రెండో దశలో బీజేపీకి భారీ మద్దతు లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'మా, మాటి, మనుష్' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన టీఎంసీ ఆ విలువలను మరచిపోయిందని మోదీ విమర్శించారు. తల్లులు కన్నీళ్లు పెడుతున్నారని, భూమి చొరబాటుదారుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. బంగాల్ ప్రజలను ఉద్దేశించి బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చిన మోదీ, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. బంగాల్ దేశంలో అగ్రస్థానంలో నిలిచే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు.

# వైట్ హౌస్ విందులో కాల్పులపై ఎలాన్ మస్క్ తీవ్ర స్పందన



- రాజకీయ హింసపై ఆందోళన వ్యక్తం
- ట్రంప్ హాజరైన కార్యక్రమంలో ఉద్రిక్తత
- భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు

**వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికాలో రాజకీయ హింసపై ఆందోళనలు పెరుగుతున్న వేళ వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో జరిగిన కాల్పుల ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడిపై దాడి ప్రయత్నం ఆందోళనకరమని పేర్కొన్నారు. వాషింగ్టన్ డీసీలోని వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ దుండగుడు ఆయుధాలతో లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తూ కాల్పులకు తెగబడ్డాడు.

కాల్పుల శబ్దంతో అక్కడున్న జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, అధికారులు భయంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి ట్రంప్, ఆయన సతీమణి మెలానియా ట్రంప్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటనలో ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌కు బుల్లెట్ తగిలినప్పటికీ ఆయన బుల్లెట్ ప్రూఫ్ వెస్ట్ ధరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. అతను ఒంటరిగా ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దాడి వెనుక ఉద్దేశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనతో అమెరికాలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. రాజకీయ హింస పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అమెరికా ఘటనపై ప్రధాని మోదీ స్పందన

- ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు
- ట్రంప్ భద్రతపై ఊరట వ్యక్తం
- వాషింగ్టన్ విందులో కాల్పులతో కలకలం
- దాడిని ఖండించిన భారత ప్రధాని

**వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన కార్యక్రమం వద్ద జరిగిన కాల్పుల ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని స్పష్టం చేశారు. వాషింగ్టన్ డీసీలోని హిల్టన్ హోటల్‌లో వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందు సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. కార్యక్రమానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రథమ మహిళ మెలానియా ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో హోటల్ సమీపంలో కాల్పుల శబ్దాలు వినిపించడంతో తీవ్ర కలకలం రేగింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ట్రంప్ దంపతులు, ఇతర ప్రముఖులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విందును నిలిపివేశారు. ఈ ఘటనపై నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా స్పందిస్తూ ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు



క్షేమంగా ఉన్నారని తెలిసి ఊరట కలిగిందని తెలిపారు. వారి భద్రత కోసం శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక ఈ ఘటనపై డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ ఆయుధాలతో వచ్చిన వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారని తెలిపారు. ఆ వ్యక్తి ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరిపినప్పటికీ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ కారణంగా ప్రాణాపాయం తప్పిందని చెప్పారు. దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అతను ఒంటరిగా ఈ దాడికి పాల్పడ్డాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి.

# దృశ్య సమాచార విప్లవంలో నూతన ఒరవడి

నేటి డిజిటల్ ప్రపంచంలో సమాచార మార్పిడి అనేది మాటలు, అక్షరాల కంటే దృశ్య రూపంలోనే వేగంగా ప్రజలకు చేరువవుతోంది. ఒక చిన్న చిహ్నం లేదా చిత్రం ద్వారా క్లిష్టమైన విషయాన్ని కూడా సులభంగా వివరించగల శక్తి గ్రాఫిక్ డిజైన్‌కు ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా ప్రపంచ గ్రాఫిక్ డిజైన్ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ద్వారా ఈ కళాకారుల ప్రతిభను సమాజం గుర్తించే అవకాశం లభిస్తోంది. కళకు సాంకేతికత తోడైనప్పుడు కలిగే అద్భుతమైన మార్పులను ఈ రోజు మనకు గుర్తుచేస్తుంది. గ్రాఫిక్ డిజైన్ అనేది కేవలం రంగులు లేదా బొమ్మలకు పరిమితమైన అంశం కాదు. ఇది వినియోగదారుడి ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఒక శక్తివంతమైన సాధనం. వ్యాపార సంస్థలు తమ బ్రాండ్ విలువను పెంచుకోవడానికి, ప్రభుత్వాలు తమ పథకాలను సామాన్యులకు చేరవేయడానికి ఈ రంగంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. కంటికి ఇంపుగా కనిపిస్తూనే అర్థవంతమైన సందేశాన్ని అందించడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. అందుకే ఆధునిక సమాచార వ్యవస్థలో డిజైనర్లు ఒక వెన్నుముకలా నిలుస్తున్నారు.




సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ గ్రాఫిక్ డిజైన్ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో కేవలం ప్రింట్ మీడియాకే పరిమితమైన ఈ కళ, ఇప్పుడు వెబ్ డిజైనింగ్, యానిమేషన్, సోషల్ మీడియా పోస్టర్లు వంటి వివిధ రూపాల్లో విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిజైనర్లు తమ వినూత్న ఆలోచనలతో అద్భుతాలను సృష్టిస్తున్నారు. కేవలం వినోదం కోసమే కాకుండా సమాజంలో మార్పు తీసుకురావడానికి కూడా ఈ సృజనాత్మకతను ఆయుధంగా వాడుతున్నారు. సామాజిక బాధ్యతతో కూడిన డిజైన్లు ఎప్పుడూ చిరస్థాయిగా నిలిచిపోతాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు గ్రాఫిక్ డిజైన్ ఒక గొప్ప ఉపాధి మార్గంగా మారింది. సృజనాత్మకతతో పాటు సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఈ విభాగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. నిరంతరం మారుతున్న ట్రెండ్స్‌ను గమనిస్తూ, పాత పద్ధతులను వదలకుండా కొత్త ప్రయోగాలను చేసేవారికే ఇక్కడ గుర్తింపు లభిస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడం ద్వారా ప్రపంచ స్థాయిలో రాణించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. డిజైన్ ప్రాముఖ్యతను గుర్తించినప్పుడే ఆ రంగానికి అసలైన గౌరవం లభిస్తుంది.

డిజైనర్లు కేవలం అందమైన చిత్రాలను మాత్రమే కాకుండా, ప్రజల అవసరాలకు తగ్గట్టుగా సమాచారాన్ని క్రమబద్ధీకరిస్తారు. ప్రతి రంగుకు ఒక అర్థం, ప్రతి అక్షరానికి ఒక ప్రాణం పోస్తూ వారు చేసే కృషి అభినందనీయం. సమాజంలోని అక్షరాస్యత లేని వారికి కూడా ఒక చిత్రం ద్వారా విషయాన్ని అర్థం చేయించవచ్చు. దీనివల్ల సమాచార అంతరాలు తగ్గి, జ్ఞాన సమపార్జన అందరికీ సాధ్యమవుతుంది. దృశ్య రూపంలోని సమాచారం మెదడులో ఎక్కువ కాలం గుర్తుండిపోవడం దీని ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిజైన్ కౌన్సిల్స్ ఈ దినోత్సవం సందర్భంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తాయి. వర్క్‌షాపులు, సెమినార్లు, ప్రదర్శనల ద్వారా కొత్తగా ఈ రంగంలోకి వచ్చే వారికి అవగాహన కల్పిస్తారు. నిపుణులు తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా వర్ధమాన కళాకారులు ఎన్నో విషయాలు నేర్చుకునే వీలుంటుంది. ఈ పరస్పర సహకారం వల్ల సరికొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుంది. డిజైన్ రంగం ఆర్థిక వ్యవస్థకు కూడా ఒక రకంగా ఊతం ఇస్తోంది. మానవ జీవనశైలిలో డిజైన్ ఒక భాగంగా మారిపోయింది. మనం ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు చూసే వస్తువులు, వాడే యాప్‌లు ప్రతిదీ ఒక డిజైనర్ ఆలోచన నుండే పుట్టాయి. వాడకంలో సౌలభ్యం, చూసేందుకు ఆహ్లాదం కలిగించేలా వీటిని రూపొందించడం వెనుక ఎంతో మేధోమథనం దాగి ఉంటుంది. అందుకే డిజైనర్లను ఆధునిక కాలపు కవులు లేదా చిత్రకారులుగా అభివర్ణించవచ్చు. వారి ఆలోచనలు సమాజాన్ని మరింత అందంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతున్నాయి. గ్రాఫిక్ డిజైన్ అనేది నిరంతర ప్రక్రియ. మారుతున్న కాలానికి అనుగుణంగా దీని శైలి మారుతూ ఉంటుంది. ఈ దినోత్సవం కేవలం ఒక రోజు వేడుకగా కాకుండా, నిరంతరం సృజనాత్మకతను ప్రోత్సహించే స్ఫూర్తిగా నిలవాలి. ప్రతిభను గుర్తించడం, నైపుణ్యానికి గౌరవం ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన ఆవిష్కరణలను మనం చూడవచ్చు. సమాచార ప్రపంచాన్ని దృశ్య కావ్యంగా మార్చే ఈ రంగం ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంటుంది. నూతన పోకడలను ఆహ్వానిస్తూ ముందుకు సాగడమే ఈ వృత్తి యొక్క పరమార్థం.

# పిల్లలు పుట్టిన తర్వాత తండ్రులకూ డిప్రెషన్... ఆలస్యంగా బయటపడుతున్న మానసిక ఒత్తిడి!

పిల్లలు పుట్టిన తర్వాత తల్లుల్లో మాత్రమే కాదు, తండ్రుల్లో కూడా మానసిక ఆరోగ్య సమస్యలు కనిపిస్తున్నాయని తాజా అధ్యయనం వెల్లడించింది. సాధారణంగా "పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్" అనే సమస్యను తల్లులతో మాత్రమే అనుసంధానిస్తారు. అయితే తాజా పరిశోధనలు తండ్రులు కూడా ఈ సమస్యకు గురవుతున్నారని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా ఇది వెంటనే కాకుండా కొంతకాలం తర్వాత బయటపడటం గమనార్హం. స్వీడన్‌కు చెందిన లక్షలాది తండ్రులపై నిర్వహించిన అధ్యయనం ప్రకారం, పిల్లలు పుట్టిన వెంటనే కాకుండా సుమారు ఒక సంవత్సరం తర్వాత తండ్రుల్లో డిప్రెషన్, ఒత్తిడి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గర్భధారణ సమయంలో, ప్రారంభ నెలల్లో తండ్రులు సాధారణంగా సంతోషంగా లేదా స్థిరంగా ఉంటారు. కానీ కాలక్రమేణా బాధ్యతలు పెరగడంతో మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఈ పరిస్థితిలో "డిలేడ్ ఎఫెక్ట్" ముఖ్య కారణంగా గుర్తించారు. అంటే సమస్య వెంటనే బయటపడకుండా, క్రమంగా పెరుగుతూ కొంతకాలం తర్వాత తీవ్రంగా కనిపించడం. కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఒత్తిడి, నిద్రలేమి, జీవనశైలి మార్పులు—all కలిసి తండ్రులపై ప్రభావం చూపుతున్నాయి. మొదట్లో తమ భావాలను దాచిపెట్టడం వల్ల సమస్యలు మరింత ఆలస్యంగా బయటపడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. పరిశోధనల ప్రకారం సుమారు ప్రతి 10 మంది తండ్రుల్లో ఒకరికి ఈ సమస్య కనిపించే అవకాశం ఉంది. తండ్రుల్లో డిప్రెషన్ లక్షణాలు తల్లులతో పోలిస్తే కొంత భిన్నంగా ఉంటాయి. చిరాకు, కోపం, కుటుంబ సభ్యుల నుంచి దూరంగా ఉండడం, ఆలోచించకుండా ప్రవర్తించడం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. కొందరిలో తలనొప్పి, జీర్ణ సమస్యలు వంటి శారీరక లక్షణాలు కూడా ఉంటాయి. హార్మోన్ మార్పులు కూడా ఈ సమస్యకు కారణంగా భావిస్తున్నారు. టెస్టోస్టెరోన్ తగ్గడం, కార్టిసోల్ వంటి హార్మోన్ల మార్పులు తండ్రుల మానసిక స్థితిపై ప్రభావం చూపుతాయి. భార్యకు ఇప్పటికే డిప్రెషన్ ఉంటే, తండ్రిలో ఈ సమస్య వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుంది. ప్రస్తుతం ఆరోగ్య వ్యవస్థలో తల్లులపై ఎక్కువ దృష్టి పెట్టబడుతున్నప్పటికీ, తండ్రుల మానసిక ఆరోగ్యం పెద్దగా పర్యవేక్షించబడటం లేదు. దీనివల్ల సమస్యలు ఆలస్యంగా గుర్తించబడుతున్నాయి. నిపుణులు తండ్రుల మానసిక స్థితిని కనీసం ఒక సంవత్సరం పాటు గమనించాలని సూచిస్తున్నారు. మొత్తానికి పిల్లలు పుట్టిన తర్వాత తండ్రుల మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రారంభ దశలోనే సమస్యలను గుర్తించి చికిత్స తీసుకుంటే, కుటుంబంలో సానుకూల వాతావరణం ఏర్పడటమే కాకుండా పిల్లల అభివృద్ధిపైనా మంచి ప్రభావం చూపుతుంది.





# హేర్ క్లిప్స్... స్టైల్ మాత్రమే కాదు, రోజువారీ అవసరం!

హేర్ క్లిప్స్ ఇప్పుడు కేవలం జుట్టును పట్టుకునే సాధనంగా కాకుండా ఫ్యాషన్‌లో ఒక ముఖ్య భాగంగా మారాయి. రోజువారీ జీవితంలో సులభంగా జుట్టును సర్దుకోవడానికి ఉపయోగించే ఈ చిన్న యాక్సెసరీ, ఇప్పుడు స్టైల్ స్టేట్‌మెంట్‌గా కూడా నిలుస్తోంది. చిన్న క్లిప్స్ నుంచి పెద్ద క్లా క్లిప్స్ వరకు అనేక రకాల డిజైన్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. హేర్ క్లిప్స్ సాధారణంగా మెటల్ లేదా ప్లాస్టిక్‌తో తయారు చేస్తారు. వీటిని జుట్టును స్థిరంగా ఉంచడానికి, ముఖంపై పడకుండా నియంత్రించడానికి ఉపయోగిస్తారు . చిన్న క్లిప్స్ ముందు భాగంలో జుట్టును పట్టుకోవడానికి ఉపయోగిస్తే, పెద్ద క్లిప్స్ మొత్తం జుట్టును బన్ లేదా పోనీటెయిల్‌గా సెట్ చేయడానికి ఉపయోగిస్తారు. ఇటీవలి ట్రెండ్‌లలో క్లా క్లిప్స్, పర్ల్ క్లిప్స్, డెకరేటివ్ హెయిర్ పిన్స్, బౌ క్లిప్స్ ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్నాయి. 2026లో ఓవర్‌సైజ్ బారెట్‌లు, స్టేట్‌మెంట్ క్లిప్స్ వంటి డిజైన్‌లు ఫ్యాషన్ ప్రపంచంలో ముందంజలో ఉన్నాయని ఫ్యాషన్ నిపుణులు చెబుతున్నారు . ఇవి కేవలం జుట్టు కోసం మాత్రమే కాదు, మొత్తం లుక్‌ను ఎలివేట్ చేసే యాక్సెసరీలుగా మారాయి. ఈ రోజుల్లో క్లిప్స్ ఎన్నో రకాలుగా అందుబాటులో ఉన్నాయి—డైలీ యూజ్ క్లిప్స్, పార్టీ వేర్ క్లిప్స్, క్యూట్ డిజైన్ క్లిప్స్, కిడ్స్ క్లిప్స్. తక్కువ ధరల్లో కూడా మంచి స్టైలిష్ క్లిప్స్ దొరుకుతున్నాయి, అందుకే యువతలో వీటి వినియోగం భారీగా పెరిగింది . అయితే హేర్ క్లిప్స్ వాడేటప్పుడు జాగ్రత్తలు కూడా అవసరం. క్లిప్‌ను చాలా గట్టిగా పెట్టడం వల్ల జుట్టు మూలాలకు ఒత్తిడి పెరిగి హెయిర్ బ్రేకేజ్ వచ్చే ప్రమాదం ఉంది. ఒకే ప్రదేశంలో తరచుగా క్లిప్ పెట్టడం వల్ల జుట్టు బలహీనపడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు . ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో పెద్ద క్లా క్లిప్స్ వాడకూడదని సూచిస్తున్నారు, ఎందుకంటే ప్రమాద సమయంలో అవి గాయాలకు కారణం కావచ్చు . అందువల్ల సరైన సందర్భంలో, సరైన విధంగా వాడటం చాలా ముఖ్యం. మొత్తానికి హేర్ క్లిప్స్ చిన్న యాక్సెసరీ అయినప్పటికీ, వాటి ప్రభావం పెద్దది. సరైన క్లిప్ ఎంచుకుంటే మీ లుక్‌ను పూర్తిగా మార్చగలదు. ఫ్యాషన్‌తో పాటు జుట్టు ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని వాడితేనే మంచి ఫలితాలు పొందవచ్చు.



# టీకా తర్వాత జ్వరం... భయం కాదు, రక్షణ సంకేతం!

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24 నుండి 30 వరకు నిర్వహించే ప్రపంచ రోగనిరోధక శక్తి వారోత్సవం సందర్భంగా టీకాల ప్రాముఖ్యత మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంలో టీకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గత ఐదు దశాబ్దాల్లో టీకాల వల్ల కోట్లాది ప్రాణాలు కాపాడబడ్డాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంటోంది. అయినప్పటికీ టీకా వేసుకున్న తర్వాత జ్వరం రావడం వల్ల చాలామంది ఆందోళన చెందుతున్నారు. టీకా శరీరంలోకి ప్రవేశించినప్పుడు, అందులోని బలహీనమైన లేదా నిర్జీవ వైరస్/బ్యాక్టీరియా భాగాలను మన రోగనిరోధక వ్యవస్థ గుర్తిస్తుంది. వెంటనే శరీరం వాటిపై పోరాడేందుకు యాంటీబాడీలు తయారు చేయడం ప్రారంభిస్తుంది. ఈ ప్రక్రియలో కణాలు 'సైటోకిన్స్' అనే రసాయనాలను విడుదల చేస్తాయి. ఇవే శరీరంలో రోగనిరోధక ప్రతిస్పందనను వేగవంతం చేస్తాయి. ఈ పోరాటం జరుగుతున్న సమయంలో శరీర ఉష్ణోగ్రత తాత్కాలికంగా పెరుగుతుంది. అందువల్ల జ్వరం, అలసట, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంటే ఇది అనారోగ్యం సంకేతం కాకుండా, శరీరం లోపల రక్షణ వ్యవస్థ పనిచేస్తోందని సూచించే లక్షణం అని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రతి ఒక్కరి శరీరం టీకాకు ఒకే విధంగా స్పందించదు. కొందరిలో రోగనిరోధక వ్యవస్థ వేగంగా స్పందించడంతో జ్వరం వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా యువకుల్లో రోగనిరోధక శక్తి చురుగ్గా ఉండటం వల్ల జ్వరం వచ్చే అవకాశాలు ఎక్కువ. వయస్సు పైబడిన వారిలో ఈ స్పందన కొంత మెల్లగా ఉండటంతో లక్షణాలు తక్కువగా ఉండవచ్చు. మరోవైపు, గతంలో అదే వైరస్‌కు గురైన వారిలో శరీరం ఇప్పటికే గుర్తింపు కలిగి ఉండటంతో వేగంగా స్పందిస్తుంది. అందువల్ల వారికి జ్వరం వచ్చే అవకాశాలు తగ్గుతాయి. అయితే జ్వరం రాకపోయినా టీకా పనిచేయదని భావించడం పూర్తిగా తప్పు. లక్షణాలు కనిపించకపోయినా శరీరంలో రోగనిరోధక శక్తి ఏర్పడుతూనే ఉంటుంది. మొత్తానికి టీకా తర్వాత జ్వరం రావడం సహజమైన, తాత్కాలిక ప్రతిస్పందన మాత్రమే. ఇది భయపడాల్సిన విషయం కాదు. జ్వరం వచ్చినా, రాకపోయినా టీకా తన పని చేస్తుంది—మన శరీరాన్ని భవిష్యత్తులో వచ్చే ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షిస్తుంది. కాబట్టి అపోహలకు లోనుకాకుండా, వైద్యుల సూచనలు పాటిస్తూ టీకాలు తీసుకోవడం సమాజ ఆరోగ్యానికి అత్యంత అవసరం.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# 'కర'లో హీరోయిన్ మార్పు ఆసక్తికరం

కోలీవుడ్ స్టార్ ధనుష్, మలయాళ నటి మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ కర విడుదలకు సిద్ధమవుతోంది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 30న తమిళంతో పాటు తెలుగులోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ధనుష్, మమితా భార్యాభర్తలుగా కనిపించనున్నారు.

అయితే ఈ చిత్రంలో హీరోయిన్‌గా మొదట మమితా బైజును ఎంపిక చేయలేదని దర్శకుడు విఘ్నేష్ రాజా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈ పాత్ర కోసం తొలుత చైత్ర జె ఆచార్ను ఎంపిక చేసి లుక్ టెస్ట్ కూడా నిర్వహించారు. కానీ ఆమె ఇప్పటికే నటించిన మై లార్డ్లో కూడా ఇలాంటి గెటప్ ఉండటంతో, రెండు సినిమాల్లో ఒకే తరహా పాత్రగా కనిపిస్తుందని భావించి మార్పు చేసినట్లు చెప్పారు.

తర్వాత మమితా బైజును సంప్రదించగా, ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా ఉండటంతో ఆమె అంగీకరిసుందా లేదా అన్న సందేహం తమకు కలిగిందని తెలిపారు. అయితే కథ విన్న వెంటనే ఆమె ఒప్పుకోవడం ఆశ్చర్యం కలిగించిందని దర్శకుడు చెప్పారు. ఇదిలా ఉండగా, తమిళ సినిమాల్లో అవకాశాల కోసం మలయాళ నటీమణులను ఎంపిక చేస్తున్నారన్న విమర్శలపై మమితా స్పందించారు. ఒక నటిగా కొత్త పాత్రలు చేయడం తన బాధ్యత అని, దర్శకుడు తన పాత్రకు సరిపోతామనుకుంటే అవకాశం ఇస్తారని పేర్కొన్నారు. ఆ అవకాశాన్ని తన ప్రతిభతో నిలబెట్టుకోవడమే తన లక్ష్యమని తెలిపారు.

ఈ చిత్రంలో జయరాం, సూరజ్ వెంజరమూడు, కేఎస్ రవికుమార్, కరుణాస్ కీలక పాత్రల్లో నటించారు. సంగీతాన్ని జీవీ ప్రకాష్ కుమార్ అందించగా, వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఇషారి కె గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో ఒక సాధారణ వ్యక్తి ఎలా దొంగగా మారాడు అనే అంశాన్ని ఆసక్తికరంగా చూపించబోతున్నారు. ఈ కాంబినేషన్‌తో 'కర'పె మంచి అంచనాలు నెలకొన్నాయి.

# బోయపాటి–కార్తీ కాంబో చర్చల్లో

బోయపాటి శ్రీను తదుపరి సినిమా ఎవరితో అన్న దానిపై టాలీవుడ్‌లో ఆసక్తికర చర్చలు కొనసాగుతున్నాయి. 'అఖండ 2' తర్వాత కొత్త కథపై పని చేస్తున్న ఈ దర్శకుడు ముందుగా అల్లు అర్జున్తో సినిమా చేయాలని భావించినప్పటికీ అది వర్కౌట్ కాలేదని సమాచారం. అనంతరం బాలీవుడ్ నటుడితో సినిమా చేస్తాడన్న ప్రచారం కూడా వినిపించినా అవి కేవలం పుకార్లుగానే మిగిలిపోయాయి. తాజాగా కోలీవుడ్ స్టార్ కార్తీ పేరు తెరపైకి రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తెలుగు, తమిళ భాషల్లో మంచి అభిమాన వర్గం కలిగిన కార్తీ కోసం బోయపాటి ఇప్పటికే కథ సిద్ధం చేశాడని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అన్ని అంశాలు అనుకూలిస్తే ఈ కాంబినేషన్ త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. మాస్ యాక్షన్ సినిమాలకు ప్రత్యేక గుర్తింపు పొందిన బోయపాటి, కార్తీ కోసం ఎలాంటి కథను సిద్ధం చేశాడు, ఈ కాంబో తెరపై ఎలా ఉండబోతుందన్నది ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.





# సుశాంత్ సింగ్ రాజ్ పుత్ కేసులో ఈ హీరోయిన్ కి బిగ్ రిలీఫ్!

బాలీవుడ్ సినిమా దగ్గర తన కొన్ని సినిమాలతోనే సత్తా చాటి చిన్న వయసులోనే మరణించిన టాలెంటెడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ కోసం తెలుగు ఆడియెన్స్ కి కూడా బాగానే తెలుసు. ఎం ఎస్ ధోని జీవిత చరిత్రని బయోపిక్ గా చేసిన ఈ యంగ్ హీరో 2020 కరోనా లాక్ డౌన్ సమయంలో అనుమానాస్పదంగా మరణించడం అందరినీ తీవ్రంగా కలచి వేసింది.

అయితే తనది ఆత్మహత్యే అని సిబిఐ కోర్ట్ నివేధిక అందించింది కానీ అప్పట్లో తన గర్ల్ ఫ్రెండ్ ప్రముఖ హీరోయిన్ రెయా చక్రబోర్తి పేరు బాగా వినిపించింది. అయితే అప్పటి నుంచి ఆమె బ్యాంకు ఖాతా అలాగే ఆమె సోదరుడు బ్యాంకు ఖాతాలని ఎన్ సి బి (నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో) వారు ఫ్రీజ్ చేసేసారు. అయితే ఈ విషయంలో వారికి ఎన్ డీ పి సి కోర్ట్ వారు ఉపశమనం అందించారు. ఆమె బ్యాంక్ ఖాతాలను డీఫ్రీజ్ చేయాలని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ విషయంలో దర్యాప్తు సంస్థ తప్పనిసరిగా పాటించాల్సిన చట్టపరమైన విధివిధానాలను అనుసరించడంలో విఫలమైందని కోర్టు పేర్కొంది. ఇలా మొత్తానికి యువ హీరోయిన్ కి బిగ్ రిలీఫ్ దక్కింది.

## 'టాక్సిక్' తో సత్యదేవ్ క్లాష్ కి సిద్ధం.. 'రావు బహదూర్' డేట్ వచ్చేసింది!

మన టాలీవుడ్ దగ్గర ఉన్నటువంటి విలక్షణ నటుల్లో సూపర్ టాలెంటెడ్ నటుడు సత్యదేవ్ కూడా ఒకరు. అయితే సత్యదేవ్ ఇప్పుడు హీరోగా నటిస్తున్న ఇంట్రెస్టింగ్ పీరియాడిక్ ప్రయోగాత్మక చిత్రమే "రావు బహదూర్". దర్శకుడు వెంకటేష్ మహాతో చేస్తున్న ఈ సినిమాపై మంచి బజ్ ఉంది. అయితే పలు కారణాలు చేత ఆలస్యం అవుతూ వచ్చిన ఈ సినిమా ఎట్టకేలకి రిలీజ్ డేట్ ని ఫిక్స్ చేసుకుంది. ఈ చిత్రాన్ని మేకర్స్ ఈ జూన్ 5న గ్రాండ్ గా విడుదల చేస్తున్నట్టు కన్ఫర్మ్ చేశారు. అయితే సరిగ్గా దీనికి ముందే భారీ చిత్రం "టాక్సిక్" జూన్ 4 డేట్ తో సిద్ధంగా ఉంది. మరి ఇలాంటి సినిమా ఉన్నప్పటికీ దీనిని అనౌన్స్ చేయడం మేకర్స్ తమ సినిమా పట్ల ఎంత నమ్మకంగా ఉన్నారో అనేది అర్ధం చేసుకోవచ్చు. కేరాఫ్ కంచరపాలెం, సత్యదేవ్ తోనే ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య సినిమాలతో సత్తా చాటిన దర్శకుడుతో మరో సినిమా కావడంతో దీనిపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. సో ఈ ఇంట్రెస్టింగ్ క్లాష్ లో ఏమవుతుందో చూడాలి.






# అషు రెడ్డిపై మోసం ఆరోపణలు కలకలం

బిగ్‌బాస్ ఫేమ్ నటి అషు రెడ్డిపై భారీ మోసం ఆరోపణలు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నాయి. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడిని పెళ్లి పేరుతో నమ్మించి కోట్ల రూపాయలు తీసుకున్నారనే ఆరోపణలతో ఆమెతో పాటు కుటుంబ సభ్యులపై హైదరాబాద్ సిటీ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో కేసు నమోదైందని ప్రచారం జరుగుతోంది.

వివరాల ప్రకారం, హైదరాబాద్ షేక్‌పేట్‌కు చెందిన కుటుంబానికి చెందిన ధర్మేంద్ర అనే యువకుడికి 2018లో అషు రెడితో పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అమెరికాలో చదువులు పూర్తిచేసి సినిమా అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చినట్లు చెప్పి అతనితో సన్నిహిత సంబంధం పెంచుకుందని, ఆ పరిచయం ప్రేమగా మారిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు ఆర్థిక సహాయం పేరుతో భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మొత్తం రూ.9.35 కోట్ల నగదు, సుమారు 5 కిలోల బంగారం, అలాగే పాటు. వాహనాలు కొనుగోలు చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆస్తులన్నీ ఆమె పేరుతోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు కూడా పేర్కొన్నారు. తర్వాత పెళ్లి విషయంలో వెనక్కి తగ్గిందని బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

ఇదిలా ఉండగా, తనపై వస్తున్న ఆరోపణలపై అషు రెడ్డి పరోక్షంగా స్పందించింది. తన అనుమతి లేకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేసే కఠిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని సోషల్ మీడియా ద్వారా హెచ్చరించింది.

డబ్‌స్మాష్ వీడియోలతో గుర్తింపు తెచ్చుకున్న అషు రెడ్డి, చల్ మోహన్ రంగ సినిమాతో సినీరంగ ప్రవేశం చేసింది. అనంతరం బిగ్ బాస్ తెలుగు సీజన్ 3 ద్వారా మరింత పాపులారిటీ సంపాదించింది. ప్రస్తుతం పలు టెలివిజన్ షోలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా కొనసాగుతోంది. తాజా ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారిక దర్యాప్తు అనంతరం స్పష్టతకు రానుంది. ప్రస్తుతం ఈ విషయం సినీ వరాలో హాట్ టాపిక్‌గా మారింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in